B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 244 | శనివారం | 19-09-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



అబద్ధాలు ప్రచారం చేయొద్దు

- చెబితే నేనే భోజనం పెట్టి పాలం చూపించేవాడ్ని: హరీశ్ రావు
- సిద్దిపేటలో తన భూముల పరిశీలనపై హరీశ్ రావు స్పందన
- వస్తున్నారని చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య
- 3,000 మంది పోలీసుల మోహరింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన హరీశ్
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో ప్రకటించానని స్పష్టీకరణ
- అబద్ధాలు ప్రచారం చేయొద్దని కాంగ్రెస్ నేతలకు హితవు

మన ప్రజాపక్షం,హైదరాబాద్

సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది



మాకు మరో 9.56 లక్షల ఇండ్లను కేటాయించండి

కేంద్రమంత్రిని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు. తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు సీఎం కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్?ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్రమంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు. తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా రాష్ట్రానికి తొలి విడతలో 2 లక్షల ఇళ్లను కేటాయించిన సంగతి తెలిసిందే.

తెలంగాణకు 2 లక్షల పీఎంఏవైజీ ఇళ్లు

తెలంగాణలోని 11.56 లక్షల పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని సీఎం గతంలో కేంద్రానికి విజ్ఞప్తి చేయగా, 2 లక్షలు మంజూరు అయ్యాయి. మిగిలిన 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్రమంత్రికి వివరించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని, ఎల్‌నినో నేపథ్యంలో తాగు నీరు, విద్యుత్ కొరత లేకుండా చర్యలు



పూర్తి ఆధారాలు ఉన్నాయి

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- కేసీఆర్,హరీశ్ రావు భూములపై పూర్తి ఆధారాలు ఉన్నాయి: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారన్న పొంగులేటి
- 2004లో ఒక ఎకరా మాత్రమే చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల భూములు ఎలా వచ్చాయని ప్రశ్న
- తమ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని వ్యాఖ్య

మన ప్రజాపక్షం,హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓవర్ లాప్ ల్యాండ్‌లో ఉన్నారని, సర్వే అనంతరం వ్యత్యాసాలు బయటపడితే ఆయనకు నోటీసులు ఇస్తామని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉందని చూపించిన కేసీఆర్‌కు వందల కోట్ల విలువైన భూములు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. తమ భూముల కోసం వచ్చిన దళితులను నిలబెట్టి పసుపు నీళ్లు చల్లించిన

అనర్హత వేటు వేసిన హైకోర్టు

ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసిన హైకోర్టు

ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేసింది. ఈ విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు రద్దు చేసింది.



మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపు అంశంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పునిస్తూ ఆయనపై అనర్హత వేటు వేసింది. దానం నాగేందర్ విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని

సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం
- భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి సంజయ్
- కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య
- కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ



మన ప్రజాపక్షం,హైదరాబాద్

సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి

ఉగ్ర ముఠా గుట్టురట్టు

- జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర ముఠా గుట్టురట్టు
- లష్కరే తోయిబా ఉగ్రవాదులకు సహకరించిన ముగ్గురు నిందితులు అరెస్ట్
- లష్కరే తోయిబా ఉగ్రవాదులకు ఆశ్రయం, సహాయం అందించిన నిందితులు
- వారిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్న అధికారులు



మన ప్రజాపక్షం, జమ్మూకశ్మీర్

జమ్మూకశ్మీర్ పోలీసులు ఓ ఉగ్రవాద ముఠా గట్టురట్టు చేశారు. లష్కరే తోయిబా ఉగ్రవాదులకు ఆశ్రయం, సహాయం అందించిన ముగ్గురు

బీసీల జనాభా తక్కువగా చూపే కుట్ర..

కేంద్రంపై కవిత విమర్శలు

2

మా ఆస్తులు తీసుకుని 1,000 కోట్లు ఇవ్వండి

రేవంత్ కు కేటీఆర్ సవాల్

- బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న కేటీఆర్
- హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రంబవళ్లు ప్రయత్నించామని వెల్లడి
- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు



మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఫార్ములా ఈ-రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్

22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..

సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!

- ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి
- పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ



మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

పెళ్లిలో ఒకే వంటకం

- పాకిస్థాన్‌లో తీవ్ర ఇంధన సంక్షోభం..
- పెళ్లిలో ఒకే వంటకం ఉండాలని ఆదేశాలు
- ఇంధన సంక్షోభంతో పాకిస్థాన్‌లో కఠిన పొదుపు చర్యలు
- ప్రభుత్వ వాహనాల ఇంధన కోటాలో 50 శాతం కోత
- అధికారుల విదేశీ పర్యటనలపై మూడు నెలల నిషేధం
- రాత్రి 9 గంటలకే మార్కెట్లు, 10 గంటలకే వివాహ వేడుకలు బంద్
- పెళ్లిళ్లలో ఒకే వంటకం వడ్డించాలని ఆదేశాలు

మన ప్రజాపక్షం,పాకిస్తాన్

తీవ్ర ఇంధన సంక్షోభం నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం కఠిన పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ముడి చమురు



‘మాకు మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించండి’

మొదటి పేజీ తరువాయి

చేపట్టినట్లు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం సహకారం ఇవ్వాలని కోరారు.

తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు తెలంగాణలో సన్నబియ్యాన్ని విజయవంతంగా పంపిణీ చేస్తున్నట్లు సీఎం తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్‌ను రైతులకు అందించి ప్రోత్సహిస్తున్నట్లు కేంద్రమంత్రికి వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 250 ఎకరాల్లో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించేందుకు సహకారం అందించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు.

హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం

హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం జరుగుతండటంతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్? సింగ్ చౌహాన్ హైదరాబాద్‌కు వచ్చారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అచ్చెన్నాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అనర్హత వేటు వేసిన హైకోర్టు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. అనర్హత పిటిషన్లు కొట్టివేస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఈసీకి హైకోర్టు తెలిపింది.

ఇదీ కేసు నేపథ్యం

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు వేర్వేరుగా పిటిషన్లను దాఖల చేసిన విషయం తెలిసిందే. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున శాసనసభ్యుడిగా గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని, 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హస్తం పార్టీ తరఫున పోటీ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. 10వ షెడ్యూల్ ప్రకారం వ్యవహరించకుండా, రూల్స్‌కు విరుద్ధంగా నడుచుకున్నారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని వారు హైకోర్టును కోరారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన శాసనసభాపతికి పలు ఆధారాలు సమర్పించామని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ మార్చి 11వ తేదీన ఉత్వర్వులిచ్చిందని హైకోర్టు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిన సీజే ధర్మాసనం ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయినట్లు స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇచ్చింది.

హైకోర్టు తీర్పుపై స్పందించిన కేటీఆర్

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. సత్యమేవ జయతే అంటూ ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేశారు. పార్టీ ఫిరాయించిన మిగితా వారికీ ఇదే పరిస్థితి పడుతుందన్నారు.

హైకోర్టు తీర్పు.. కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ

హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీకి విజయం లభించిందన్నారు. అమ్ముడుపోతే అనర్హత తప్పదని తాము గతంలోనే చెప్పామన్న కౌశిక్ రెడ్డి, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ అని పేర్కొన్నారు. మిగిలిన 8 మందిపైనా అనర్హత వేటు పడేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఉపఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని కౌశిక్‌రెడ్డి తెలిపారు. అధికారం ఉందని విర్రవీగితే ఎదురుదెబ్బలు తప్పవని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో.. చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

పెళ్లిలో ఒకే వంటకం

మొదటి పేజీ తరువాయి

సరఫరాలో ఏర్పడిన అంతరాయాల కారణంగా దేశంలో ఇంధన వినియోగంతో పాటు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు పలు కఠిన ఆంక్షలను అమలు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది.నూతన నిబంధనల ప్రకారం, అన్ని రకాల ప్రభుత్వ వాహనాల కొనుగోళ్లపై పూర్తిస్థాయి నిషేధం విధించారు. ప్రభుత్వ వాహనాలకు కేటాయించే ఇంధన కోటాలో రాబోయే మూడు నెలల పాటు 50 శాతం మేర కోత విధించారు. అయితే, సైన్యం, శాంతిభద్రతల పరిరక్షణ, అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. అదేవిధంగా, మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల విదేశీ పర్యటనలపై మూడు నెలల పాటు నిషేధం విధించారు. ఒకవేళ అనివార్య పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే, కేవలం ఎకానమీ క్లాస్‌లోనే వెళ్లాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ ఆంక్షల ప్రభావం సామాన్య ప్రజానీకంపై కూడా స్పష్టంగా కనిపిస్తోంది. రాత్రి 9 గంటలకల్లా మార్కెట్లు, దుకాణాలు, షాపింగ్ మాల్స్ మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వివాహ వేడుకలను రాత్రి 10 గంటలకు, రెస్టారెంట్లను రాత్రి 11 గంటలకు ముగించాలని నిబంధనలు విధించింది. ముఖ్యంగా వివాహాలు, ఇతర శుభకార్యాల్లో కేవలం ఒకే వంటకాన్ని వడ్డించాలని ప్రభుత్వం ఆదేశించడం గమనార్హం.ఇప్పటికే గత మార్చిలో కొన్ని పొదుపు చర్యలను ప్రవేశపెట్టిన పాక్ ప్రభుత్వం, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వాటిని మరింత కఠినతరం చేసింది. ఖరీదైన చమురు దిగుమతులతో ఆర్థికంగా సతమతమవుతున్న పాకిస్థాన్, ఈ చర్యల ద్వారా వనరులను పొదుపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

మొదటి పేజీ తరువాయి

సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు.కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో ‘దండయాత్ర’ చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

మా ఆస్తులు తీసుకుని 1,000 కోట్లు ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి

ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు.కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. “మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి” అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..

మొదటి పేజీ తరువాయి

తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు.22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది.ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

అబద్ధాలు ప్రచారం చేయొద్దు

మొదటి పేజీ తరువాయి

పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. “ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు” అని ఆయన వ్యాఖ్యానించారు.తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.

పూర్తి ఆధారాలు ఉన్నాయి

మొదటి పేజీ తరువాయి

చరిత్ర కేసీఆర్ కుటుంబానిదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ మంత్రి హరీశ్ రావుపై కూడా పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి భూమిపై హరీశ్ రావు మాటలు మార్చుతున్నారని, ట్రస్ట్ పేరిట భూములను దారి మళ్లించారని ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో రంగనాయక్ సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 13 ఎకరాల భూమిని డిలీట్ చేయించి, అతి తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రూ. 5.40 కోట్ల ప్రభుత్వ నిధులతో ఆ ల్యాండ్‌కు ప్రయోజనం చేకూరేలా రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమ వ్యాపార కుటుంబాలపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదన్న మంత్రి, ఈ భూ అక్రమాలకు సహకరించిన అధికారులు ఎంతటివారైనా సరే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సిద్దిపేటలో ఆక్రమణకు గురైన భూముల్లో ‘ఇందిరమ్మ టవర్స్’ నిర్మిస్తామని స్పష్టం చేశారు.

ఉగ్ర ముఠా గుట్టురట్టు

మొదటి పేజీ తరువాయి

నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక పిస్టల్, మ్యాగజైన్, మందుగుండు సామగ్రితో పాటు రెండు చైనీస్ గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఉగ్రవాదులకు సహకరిస్తున్న ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం చేశారు.తమ దర్యాప్తులో,జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ, కోట్ చార్వార్ ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు లష్కరే తోయిబా ఉగ్రవాదులకు సహకరించినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. వీరు ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడమే కాకుండా, రాజౌరీ-రేసి, పిర్ పంజాల్ ప్రాంతాల గుండా షోపియాన్ వరకు వారు వెళ్లడానికి సహాయపడ్డారని చెప్పారు. అంతేకాదు నిషేధిత ఎల్ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న లాజిస్టిక్స్ మాడ్యూల్‌లో ఈ ముగ్గురు అనుమానితులు భాగంగా ఉన్నారని పేర్కొన్నారు. వీరిపై రాజౌరీలోని ధర్మసాల్ పోలీసు స్టేషన్ లో కేసు (ఎఫ్ఐఆర్ నెం.95/2026) నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రస్తుతం తాము సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.“ఉగ్రవాదుల మాడ్యూల్‌పై జరిపిన దర్యాప్తులో కీలక విషయాలు తెలిపాయి. కోట్ చార్వాల్‌కు చెందిన మహ్మద్ అజమ్, జాకీర్ హుస్సేన్, మహ్మద్ ముస్తాఖ్ అనే ముగ్గురు వ్యక్తులు నిషేధిత ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తోయిబాకు అనుబంధంగా ఉన్న లాజిస్టిక్ సపోర్ట్ మాడ్యూల్‌లో భాగమని తేలింది. 2023లో రియాసిలోని చస్సానాలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగింది.అందులో పలువురు ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే అంతకుముందు ఆ ఉగ్రవాదులకు ఈ ముగ్గురు నిందితులు సాయం చేయడం, ఆశ్రయం కల్పించడం, వారి కోరుకున్న చోటుకు వెళ్లేందుకు సహకరం అందించారు” అని పోలీసులు తమ అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇద్దరు ఉగ్రవాదులు హతం

కాగా, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలపై భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉధంపూర్ జిల్లాలోని మజల్తా ప్రాంతంలోని బ్రెట్టల్ సోహన్, ఖుబ్బన్ అటవీ ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే వారికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జీవవీ)తో సంబంధాలున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సెప్టెంబర్ 16 (బుధవారం)న బ్రాటెల్ సోన్, ఖుబ్బన్ అటవీప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారని పక్కా సమాచారం అందడంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. సుమారు రాత్రి 9 గంటల సమయంలో సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. నిర్దిష్ట ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు ప్రారంభించారు. ఆపరేషన్ మొదలైన కాసేపటికే ఉగ్రవాదుల స్థావరం లక్ష్యంగా భద్రతాబలగాలు కాల్పులు జరిపాయి. పేలుళ్ల శబ్దాలు కూడా అటవీప్రాంతంలో వినిపించాయి. అయితే గురువారం ఉదయం భద్రతా వలయాన్ని తప్పించుకునేందుకు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరంగా కాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. అదనపు బలగాలతో అటవీ ప్రాంతాన్ని నలువైపులా దిగ్బంధించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

అదనపు బలగాలను ఘటనాస్థలికి తరలించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇద్దరు ఉగ్రవాదులు హతమైనప్పటికీ, ప్రాంతంలో మరెవరైనా దాక్కున్నారా అనే కోణంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఆపరేషన్ పూర్తిగా ముగియలేదని సైన్యం స్పష్టం చేసింది. మిగిలిన ముప్పును గుర్తించి నిర్వీర్యం చేసేందుకు భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో మోహరించి ఉన్నాయని వైట్ నైట్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు జులై 8న ఓ ఎల్ఈటీ ఉగ్రవాదిని ఎన్‌కౌంటర్‌లో మట్టుబెట్టాయి. షోపియాన్‌లోని సైద్‌పోరా ప్రాంతంలోని దట్టమైన పండ్ల తోటలో ఇద్దరు ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు నిఘా కెమెరాల్లో రికార్డైంది. లష్కరే కమాండర్ జాకీర్ గనాయ్, అతని అనుచరుడు లతీఫ్ భట్ సంచరిస్తున్నట్లు గుర్తించారు. దీంతో జులై 3న షోపియాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ), ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్(ఆర్ఆర్), సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించి ఆ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి.

బీసీల జనాభా తక్కువగా చూపే కుట్ర..

మొదటి పేజీ రువాయి

హైదరాబాద్, సెప్టెంబర్ 18: బీసీ కులాల జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్’ సదస్సులో మాట్లాడుతూ.. కేంద్రం చేసే జనగణనలో బీసీ ఉప కులాలను కూడా కలిపి లెక్కించాలని డిమాండ్ చేశారు. కులం కోసం ప్రత్యేక కాలం ఉండాల్సిందే అని స్పష్టం చేశారు. కులగణనకు ఇంకా నాలుగు నెలల సమయం ఉందని.. కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆలోచనా విధానం మారితేనే కుల వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. కులం అనేది చాలా కోణాలతో కూడిన జఠిలమైన సమస్య అని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కూడా చాలా పరిష్కారాలు అవసరం ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా రాజ్యాధికారంలో అన్ని కులాలను భాగస్వామ్యం చేస్తూనే వారిని ఆర్థికంగా బాగుచేయాలని సూచించారు. ఈ కుల వివక్ష అనే రోగాన్ని కచ్చితంగా పొగొట్టాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ ఉద్యమంలో జై తెలంగాణ అనేందుకు భయపడిన వాళ్లను కూడా బయటకు వచ్చి గట్టిగా మద్దతు తెలిపేలా చేశామని కవిత అన్నారు. బతుకమ్మ, బోనాలు ఎత్తుకుంటే లక్షలాది మంది ఆడవాళ్లు వచ్చి తెలంగాణ ఉద్యమానికి జై కొట్టారని చెప్పారు. ఆ పోరాటాల ఫలితంగా తెలంగాణను సాధించుకున్నామని.. అదే విధంగా కులాల విషయంలోనూ పరిష్కారాలు వెతకాల్సి ఉందన్నారు. కేంద్రం చేసే జనాభా గణనలో కులాల జాబితాలో ఓబీసీ కాలం పెట్టాల్సిందే అని అన్నారు. అదే విధంగా డ్రాప్ బాక్స్ అనేది కూడా కులగణనలో ఉండాలన్నారు. కేంద్రం జనాభా గణనలో బీసీ అనే కాలం మాత్రమే పెడతామని చెబుతోందని.. కానీ బీసీల్లో ఉపకులాల కాలం కూడా ఉండాలనే కోరుతున్నామని తెలిపారు. దేశంలో ఒకే కులానికి సంబంధించి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్టేటస్ ఉందన్నారు. ఉపకులాలను కూడా లెక్కించకపోతే ఆయా కులాల జనాభా చాలా తక్కువగా ఉన్నట్లు చూపే పరిస్థితి వస్తుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ చెప్పారు. కేంద్ర చేసే కులగణనలో ఒకే కాలం పెడితే ఉపకులాలుగా ఉండే వారి లెక్క వేరే ఉండి అవి మరో కులంగా మారుతుందని.. దాని కారణంగా కులాల జనాభా తక్కువగా ఉండే పరిస్థితి ఉంటుందని అన్నారు. కులాలను జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర జరుగుతున్నట్లు అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బీసీల లెక్క తక్కువ చేసి చూపిందని విమర్శించారు. గ్రామాల వారీగా కులాల జనాభాను ఇవ్వాలని అడిగితే ఇవ్వటం లేదని.. దానికి తోడు కేంద్రం ఉపకులాల కాలం పెట్టమని చెబుతోందన్నారు. ఇది కచ్చితంగా బీసీల సంఖ్యను తక్కువ చేసే కుట్రే అని ఆరోపించారు. కుల వివక్ష నిర్మూలనకు అంతా కష్టపడాలని కవిత పేర్కొన్నారు.





విద్యార్థినిలకు చట్టాలపై అవగాహన కల్పించిన షీ టీం బృందం

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం :
జిల్లా ఎస్పీ.డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా షీ టీం బృందం ఆధ్వర్యంలో తాడూరు మండలం మేడిపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల నందు ఈవ్ టీజింగ్,పోక్సో చట్టం, ఉమెన్ ట్రాఫికింగ్,చైల్డ్ మ్యారేజ్,సైబర్ క్రైమ్,డయల్112 వంటి వాటి గురుంచి అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు,విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని, ప్రయాణం చేసే అమ్మాయిలు, మహిళలు కచ్చితంగా "టి సేఫ్ " యాప్ ని డౌన్లోడ్ చేసుకొని ప్రయాణంలో ఉన్నపుడు తప్పక యాప్ ను ఉపయోగించుకోవాలని సూచించారు.జిల్లాలో రద్దీ ప్రదేశాలలో షి టీం బృందంతో నిరంతర పర్యవేక్షణ ఉందని,మహిళలు, విద్యార్థినీలు ఎవరైనా ఇబ్బందులకు, వేధింపులకు గురైతే వెంటనే డయల్ 112 లేదా 8712657676 నెంబర్ కు ఫోన్ చేసి వారి సమస్యలు, వివరాలు పోలీసులకు తెలుపుతే తక్షణ సహాయం అందుతుందని సూచించారు. అంతేకాకుండా విద్యార్థిని, విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.సైబర్ నేరాలు జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఉద్యోగ మేళా భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ

మెగా ఉద్యోగ మేళాకు పటిష్ట పోలీసు బందోబస్తు
బందోబస్తు విధులకు 600 మంది పోలీస్
ఉద్యోగ మేళాకు హాజరైయ్యే యువతకు పూర్తి రక్షణ కల్పిస్తాం
మేళా ప్రాంగణంలో పోలీస్ హెల్ప్ డెస్క్ లు

కోదాడ, మన ప్రజాపక్షం :
నేడు కోదాడ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ సిసిఆర్ కాన్వెంట్ విద్యాలయంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఉద్యోగ మేళాకు పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా తెలిపారు. ఈ సందర్భంగా ఈరోజు భద్రతా ఏర్పాట్లను ఎస్పి పరిశీలించారు. వాహనాల మార్గాలను, పార్కింగ్ స్థలాలను, ఉద్యోగ మేళా ప్రాంగణాన్ని పరిశీలించారు. పటిష్ట భద్రత ఏర్పాట్లు పూర్తి చేశాము, 600 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తారు అన్నారు.

నేడు కోదాడలో మెగా జాబ్ మేళా

300కు పైగా కంపెనీలు...3,500కు మించిన ఉద్యోగావకాశాలు
5జిల్లాల యువతీ,యువకులకు ఒకే వేదికపై ఇంటర్వ్యూలు
మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి చొరవతో "మెగా జాబ్ మేళా"


కోదాడ,మన ప్రజాపక్షం:
గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో శనివారం కోదాడలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేళాలో 300కు పైగా కంపెనీలు పాల్గొని, 3,500కు మించిన ఉద్యోగాలను కల్పించేందుకు నియామక ప్రక్రియ చేపట్టనున్నాయి.రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి సమన్వయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ఈ మేళా నిర్వహణకు సహకరిస్తున్నాయి.ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఆహ్వానించారు.సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి-భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొననున్నారు. కంపెనీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడడంతోపాటు ఒకే చోట ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం వారికి లభించనుంది.ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ పట్టభద్రులతోపాటు డిప్లొమా, ఇతర విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు తమకు సరిపడే ఉద్యోగాలను గుర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ ఇంటర్వ్యూల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లడం, కంపెనీలను నేరుగా సంప్రదించలేకపోవడం, సరైన సమాచారం అందకపోవడం వంటి సమస్యలు గ్రామీణ యువతకు అడ్డంకిగా మారుతున్నాయి. ఈ ఇబ్బందులను తగ్గించి, కంపెనీలనే యువతకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో కోదాడలో ఈ మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశారు.2025 అక్టోబర్‌లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా, సుమారు 900 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ మేళా విజయాన్ని కొనసాగిస్తూ ఈసారి మరింత భారీ స్థాయిలో కోదాడలో నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఐదు జిల్లాల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాన్ని పొందేందుకు శనివారం కోదాడలో జరిగే మెగా జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి.

సోల్జర్స్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

కుంటాల,మన ప్రజాపక్షం:నిర్మల్ జిల్లా కుంటాల మండల పరిధిలోని లింబా (బి) గ్రామంలో సోల్జర్స్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని గణనాథుడి మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ అన్నదానానికి భక్తులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.ఈ అన్నదాన కార్యక్రమానికి ప్రధాన అన్నదాతగా స్థానిక యువకుడు మచ్చల సాయి తేజ (సన్ ఆఫ్ మచ్చల మచ్చేందర్) వ్యవహరించారు. సాయి తేజ అందించిన ఆర్థిక సహాయం, సహకారంతో సోల్జర్స్ యూత్ సభ్యులు కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు, గ్రామస్తులకు యువకులు స్వయంగా వడ్డించి తమ సేవాతత్పరతను చాటుకున్నారు.గ్రామస్తుల ప్రశంసలు:పండుగ పూట గ్రామంలో ఎవరూ ఆకలితో



ఉండకూడదనే ఉద్దేశంతో, సేవా దృక్పథంతో ముందుకు వచ్చిన అన్నదాత మచ్చల సాయి తేజను, ఆయన కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ప్రతి ఏటా సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ గ్రామానికి మంచి పేరు తెస్తున్న సోల్జర్స్ యూత్



సభ్యుల కాలానుగుణ శ్రమను పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో సోల్జర్స్ యూత్ కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు మరియు భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్ఐ,కానిస్టేబుల్ అభ్యర్థులకు పోలీస్ శాఖ ఉచిత శిక్షణ

అర్హులైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నల్గొండ, మన ప్రజాపక్షం:తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో త్వరలో నిర్వహించనున్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో పోటీ పడుతున్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన 500 మంది నిరుద్యోగ యువతి, యువకులను ఎంపిక చేసి, నల్లగొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో వారికి ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అభ్యర్థులకు పోలీస్ నియామక పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమైన శారీరక దారుఢ్య శిక్షణ (ఫిజికల్ ట్రైనింగ్), రాత పరీక్షకు సంబంధించిన సిలబస్‌పై బోధన, మాక్ టెస్టులు, పరీక్షా విధానంపై అవగాహన, నిపుణుల మార్గదర్శకత్వం తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే ఎంపికైన అభ్యర్థులకు వసతి, భోజన సౌకర్యాలను కూడా ఉచితంగా కల్పించనున్నట్లు



పేర్కొన్నారు.అనుభవజ్ఞులైన శిక్షకులు, నిపుణుల ఆధ్వర్యంలో అభ్యర్థులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందిస్తూ, రాత పరీక్షతో పాటు ఫిజికల్ ఈవెంట్లలో కూడా మెరుగైన ప్రతిభ కనబరిచేలా అభ్యర్థులను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలనుకునే అభ్యర్థులు కింది గూగుల్ ఫామ్ లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.https://forms.gle/Ha8ZK33Y1emVCKmx6 అలాగే ఎస్ఐ/కానిస్టేబుల్ నియామక ప్రక్రియకు దరఖాస్తు చేసుకున్న పార్ట్ -1 అప్లికేషన్ ఫార్మ్ ప్రతిని వెంట తీసుకురావాలని సూచించారు.అభ్యర్థులు తేది 20-09-2026 ఆదివారం ఉదయం 9.00 గంటలకు ముందుగానే క్రింది కేంద్రాల్లో సంబంధిత సబ్ డివిజన్ అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుని,స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలనీ జిల్లా ఎస్పీ సూచించారు.నల్లగొండ సబ్ డివిజన్ అభ్యర్థులు: ఎన్.జి. కళాశాల, నల్లగొండ, మిర్యాలగూడ సబ్ డివిజన్ అభ్యర్థులు: మీనా ఇంజినీరింగ్ కళాశాల, మిర్యాలగూడ, దేవరకొండ సబ్ డివిజన్ అభ్యర్థులు:కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మీనాక్షి సెంటర్స్, డిండి క్రాస్ రోడ్, నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ అందిస్తున్న ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగం సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆకాంక్షించారు.ఏదైనా సందేహాలు ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్లో వివరాలు అడిగి తెలుసుకోగలరని వారు తెలిపారు.

అంతర్జాతీయ వెదురు దినోత్సవం సందర్భంగా వెదురు ఉత్పత్తుల ప్రదర్శన

వెదురు వనరులతో ఉపాధి, ఆదాయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వెదురుతో తయారు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శనను అదనపు కలెక్టర్ పరిశీలించారు. వెదురుతో తయారు చేస్తున్న గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు, వినియోగ వస్తువులను పరిశీలించి, వాటి తయారీ విధానం, మార్కెటింగ్ తదితర అంశాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య మాట్లాడుతూ వెదురు ప్రకృతి ప్రసాదించిన విలువైన వనరుల్లో ఒకటని



అన్నారు. వెదురుతో అనేక రకాల ఉపయోగకరమైన ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. సంప్రదాయ వెదురు కళాకారుల నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు, ఆధునిక డిజైన్లు మరియు నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని సూచించారు.వెదురు ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండేలా నాణ్యత, ఆకర్షణీయమైన డిజైన్లు, మార్కెటింగ్ విధానాలను మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. వెదురు ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వెదురు కళాకారులు, చేతివృత్తిదారులకు మెరుగైన




జీవనోపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.వెదురు ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం కలిగిన కళాకారులను గుర్తించి,వారికి అవసరమైన శిక్షణ, ప్రభుత్వ పథకాల ద్వారా అందే సహాయాన్ని అందించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిని ఇందిర,జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటయ్య,జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి,బిసి సంక్షేమ సహాయ అధికారి శ్రీరాములు,అధికారులు,సిబ్బంది,వెదురు కళాకారులు,కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మారుమూల ప్రాంతానికీ మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు

నల్లమల్లతో పాటు జిల్లాలో కమ్యూనికేషన్ సౌకర్యాల విస్తరణకు చర్యలు
మారుమూల ప్రాంతాల్లో 4జీ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేయాలి
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్‌కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల్ల అటవీ ప్రాంతంతో పాటు మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ కమ్యూనికేషన్ సాచ్యురేషన్ మోడ్స్ ఏర్పాటు చేసి మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ బీఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా,జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్రతో కలిసి బీఎస్ఎన్ఎల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో సెల్‌ఫోన్ టవర్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన నెట్‌వర్క్ సేవలు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటు,భూసేకరణ అనుమతులు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు.ముఖ్యంగా



నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న కమ్యూనికేషన్ టవర్ల వల్ల వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అటవీశాఖ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ టవర్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు.అదేవిధంగా జిల్లాలోని వివిధ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచు గిరిజన ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్ సేవలు అందేలా అవసరమైన చోట్ల బీఎస్ఎన్ఎల్ టవర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాల ద్వారా ప్రభుత్వ సేవలు,అత్యవసర సమాచారం,డిజిటల్ సేవలు ప్రజలకు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూమి అనుమతుల విషయంలో అటవీ,రెవెన్యూ శాఖల అధికారులు బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు కల్పించే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు వాసు మరికంటి,సుధీర్,సురేష్,నరసయ్య, కలెక్టరేట్ విభాగం సూపరిండెంట్ శోభ తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల భద్రతకు సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు కీలకం

రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈ-టెండర్ ద్వారా పారదర్శకంగా చేపట్టాలి

రూ. కోటి 50 లక్షలతో జిల్లా వ్యాప్తంగా సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు

జనగామ, మన ప్రజాపక్షం:
జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు మొత్తం రూ. కోటి 50 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా జనగామ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు చేపట్టడం జరుగుతుందని చెప్పారు.ప్రతి గ్రామంలో రెండు సీసీ టీవీ కెమెరాలను గ్రామ ప్రవేశ, నిష్క్రమణ (ఎంట్రీ--ఎగ్జిట్) ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అన్ని పనులు ప్రభుత్వ మార్గదర్శకాలు, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు.మొదటి దశలో మండలాల వారీగా ఏర్పాటు చేయనున్న కెమెరాల సంఖ్యను వివరించారు. బచ్చన్నపేట-56, నర్మెట్ట-38, తరిగొప్పుల-34, జనగామ రూరల్-167, లింగాల ఘనపురం-54, రఘునాథపల్లి-84, చిల్పూర్-42, ఘనపూర్ స్టేషన్-38, జఫర్‌గడ్-46, పాలకుర్తి-80, కొడకండ్ల-46, దేవరుప్పుల-68 కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు కోసం అవసరమైన కేబుల్ నెట్‌వర్క్, ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్, వీడియో వాల్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జాతీయ రహదారులు, మండల కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సీసీ టీవీ పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ ప్రక్రియ ఈ-టెండర్ విధానంలోనే చేపట్టాలని, జి.ఓ.నెం.52 (ఐ డ పిఆర్) నిబంధనల ప్రకారం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించారు. టెండర్ నోటిఫికేషన్‌ను సంబంధిత వెబ్‌సైట్‌లో కూడా తప్పనిసరిగా ఉంచాలని సూచించారు.ఈ సమావేశంలో డీపీఓ వెంకట్ రెడ్డి, ఏసీపీలు భీమ్ శర్మ, నర్సయ్య, ఇతర పోలీసు అధికారులు, డి సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సి సెక్షన్ సూపరింటెండెంట్ ఫణి కిశోర్, ఎస్‌హెచ్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.



ఏల్లాపై ఆరోపణలు చేసే ముందు కాంగ్రెస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలి

ధైర్యముంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

జనగామలో పల్లా రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదు

బీఆర్ఎస్ హయాంలోనే జనగామలో అనేక అభివృద్ధి పనులు



జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పై ఆరోపణలు చేసే ముందు కాంగ్రెస్ నాయకులు ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని ఆత్మవిమర్శ చేసుకోవాలని మార్కెట్ మాజీ చైర్మన్ సిద్ది లింగం అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా సిద్ధిలింగం మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్ రెడ్డి మంచి పేరున్న నాయకుడని, నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారని పేర్కొన్నారు.రైతులు, యువకులు తమ సమస్యలపై నిరసనలు తెలిపేందుకు వెళ్తే వారిని పోలీస్ స్టేషన్లలో పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి పనులు చేయించాలనే చిత్తశుద్ధి ఉంటే సంబం ధిత మంత్రులతో మాట్లాడి పనులు చేయించుకోవాలని సూచించారు.సీతక్క జనగామకు వచ్చి రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెబుతున్నారని, అసలు ఎక్కడ, ఏఏ పనులకు ఎంత నిధులు ఖర్చు చేశారో పూర్తి నివేదికను ప్రజల ముందు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జనగామలో రోడ్ల విస్తరణ, మెడికల్ కాలేజీ, కలెక్టరేట్, బతుకమ్మ కుంట తదితర అనేక అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.పల్లా రాజేశ్వర్ రెడ్డిపై ఆరోపణల్లో నిజం ఉంటే ధైర్యంగా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. జనగామ నియోజకవర్గంలో పల్లా రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని, విద్యా, వైద్య రంగాల్లో సేవలు అందిస్తూ ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలుస్తున్నారని స్పష్టం చేశారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కాంగ్రెస్ నాయకులు అనవసర విమర్శలు చేయకుండా ప్రజాసేవలో ముందుండి ప్రజలకు న్యాయం చేయాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పోకల జామున సూచించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని, ప్రజలకు ఉపయో గపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జనగామలో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు జరిగాయని తెలిపారు. ప్రధాన రహదారుల విస్తరణ, డివైడర్ల ఏర్పాటు, స్ట్రీట్ లైట్లు, చెట్ల పెంపకం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధా మాలు వంటి పలు కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జనగామకు మెడికల్ కాలేజీ, కలెక్టరేట్ తీసుకురావడంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని తెలిపారు.జనగామ మున్సిపాలిటీకి గత ఐదేళ్లలో ఒక కేంద్ర ప్రభుత్వ అవార్డు, రెండు రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు లభించాయని ఆమె గుర్తు చేసారు. ఈ అవార్డులు పాలకవర్గం, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజల సహకారంతో సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలను నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పల్లా రాజేశ్వర్ రెడ్డి తీసుకొచ్చిన సిటి స్కాన్ యంత్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.సీతక్క జనగామకు వచ్చి రూ.17 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని చెబుతున్నారని, ఆ నిధులతో చేపట్టిన పనులు ఏమిటో, ఎక్కడ ఎంత ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వెంటనే ప్రారంభించి పేద వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

గ్రామకంఠం భూములపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

1954 నుంచి గ్రామకంఠం పరిధిలో ఉన్న భూములు, ఇళ్లకు సంబంధిం చి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సురేష్ రెడ్డి కోరారు. గ్రామకంఠం కింద ఉన్న ప్రైవేట్ ఇళ్లకు సాధారణంగా సర్వే నంబర్లు ఉండవని, అలాంటి ఇళ్లను ప్రస్తుతం నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని అన్నారు.50, 60 ఏళ్లుగా ప్రజలు నివాసం ఉంటున్న ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చడంతో ఆయా ఆస్తులపై బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారని తెలిపారు. సొంత అవసరాల కోసం ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవ డానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.గ్రామకంఠం భూములకు సంబంధించి ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు నివసిస్తున్న ఇళ్ల విషయంలో ఏర్పడిన సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.గ్రామకంఠం భూములు, 22ఏ నిషేధిత జాబితాకు సంబంధించిన పూర్తి విషయ పరిజ్ఞానం, స్పష్టత లేకుండా కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడటం సరికాదని విమర్శించారు. ముందుగా సమస్యపై పూర్తి అవగాహన కల్పించుకుని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపేందుకు కృషి చేయాలని సూచించారు.


అభివృద్ధిపై అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదు

జనగామ అభివృద్ధిపై అవగాహన లేకుండా డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడటం సరికాదనీ బీఆర్ఎస్ నాయకురాలు అనిత అన్నారు.నియోజకవర్గంలో గతంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.2014 నుంచి జనగామలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. జనగామ కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, స్ట్రీట్ లైట్లు, డివైడర్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం కీలకంగా పనిచేసిందని పేర్కొన్నారు.పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యా, వైద్య రంగాల్లో స్వశక్తితో సేవలు అందిస్తూ ప్రజలకు వివిధ సందర్భాల్లో అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి సహాయం చేయడంలో ఆయన ముందుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని అనిత అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు జనగామ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వాస్తవాలను ఆధారాలతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలు, కౌన్సిలర్ లు ఉడుగుల కిష్టయ్య, సెవెళ్ల మధు సూదన్, పానుగంటి సువార్త, ఏనుగుందుల అనూష కిష్ణ, సందుపట్ల మంజుల, మాజీ కౌన్సిలర్ లు ముస్త్యాల దయాకర్, ఉల్లెంగుల నర్సింగ్ , నాయకులు మామిడాల రాజు, దామెర రాజు, రామకృష్ణ, గుర్రం నాగరాజు, ఉల్లెంగుల సందీప్, కొమ్మురాజు, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా
శాశ్వత విద్యుత్ లైన్ ఏర్పాటు

జనగామ, మన ప్రజాపక్షం:జనగామ పట్టణంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక ప్రాతిపదికన కాకుండా శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ మరియు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా విద్యుత్ మరియు లైటింగ్ ఏర్పాట్ల కోసం టీఎస్ ఎన్పీడీసీఎల్ సహకారంతో ఎస్పీఆర్ స్కూల్ నుండి సూర్యాపేట రోడ్డుపై నెల్లుట్ల బ్రిడ్జి వరకు శాశ్వత విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు.ఈ శాశ్వత విద్యుత్ లైన్ ద్వారా రాబోయే కాలంలో నిమజ్జన కార్యక్రమాలతో పాటు అవసరమైన ఇతర సందర్భాల్లో కూడా లైటింగ్ మరియు విద్యుత్ సౌకర్యాలను సులభంగా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రతి సంవత్సరం తాత్కాలిక ఏర్పాట్ల కోసం అయ్యే ఖర్చును తగ్గించడంతో పాటు, ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ప్రజాధనం నుంచి ఖర్చు చేసే ప్రతి రూపాయి సాధ్యమైనంత వరకు శాశ్వత ప్రయోజనం చేకూర్చే విధంగా వినియోగించాలనే ఉద్దేశంతో చర్యలు చేపడుతున్నాం. గణేష్ నిమజ్జన ఏర్పాట్లను కూడా భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే శాశ్వత మౌలిక వసతులుగా అభివృద్ధి చేస్తున్నాం అని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా శాశ్వత విద్యుత్ లైన్ ఏర్పాటుకు సహకరించిన టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్.ఈ. సంపత్ రెడ్డి కి మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో ఈ పనిని పూర్తి చేయడం పట్ల ఆమె అభినందనలు వ్యక్తం చేశారు.జనగామ పట్టణ అభివృద్ధిలో భాగంగా తాత్కాలిక ఏర్పాట్ల కంటే శాశ్వత మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగే విధంగా చర్యలు కొనసాగిస్తామని వారు తెలిపారు.





ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

చండూరు,మన ప్రజాపక్షం:
నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ చండూరు పోలీస్ స్టేషన్ మరియు సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు, సీసీటీవీల పనితీరు మరియు పోలీసు సేవలను సమీక్షించారు.నాణ్యమైన దర్యాప్తు, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడం, నేరాల సమర్థవంతమైన నివారణ మరియు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలను అందించాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. రౌడీషీటర్లు, అలవాటుపడిన నేరస్థులు, అనుమానితులపై కఠిన నిఘా ఉంచాలని, పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేయాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక చర్యలు మరియు సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని నొక్కి చెప్పారు.సిబ్బంది సంక్షేమాన్ని సమీక్షించిన ఎస్పీ చండూరు పరిధిలో శాంతిభద్రతలు మరియు ప్రజాభద్రతను పరిరక్షించడానికి అందరూ అంకితభావం, సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



కరెంట్ కోతలపై సబ్ స్టేషన్ ముందు రైతుల ధర్నా

చిలుకూరు,మన ప్రజాపక్షం:
చిలుకూరు మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు కోదాడ, జడ్చర్ల జాతీయ రహదారిపై శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి సక్రమంగా త్రీ-ఫేస్ విద్యుత్ సరఫరా చేయడం లేదని, వ్యవసాయానికి అవసరమైన సమయంలో కరెంటు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు కనీసం 6 గంటల పాటు కూడా నిరంతరాయంగా త్రీ-ఫేస్ విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు తెలిపారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, గంటల తరబడి విద్యుత్ కోసం ఎదురుచూడాల్సి వస్తుందని వాపోయారు. విద్యుత్ వచ్చిన సమయంలోను లో- వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉంటుందని, దీంతో వ్యవసాయ మోటర్లు సరిగా పనిచేయడం లేదని రైతులు తెలిపారు. పంటలకు నీరు అందించాల్సిన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడడంతో పంటలు ఎండిపోతున్నాయని, పంటలు చేతికి వచ్చే సమయంలో కరెంటు సమస్యతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని, వ్యవసాయానికి సక్రమంగా 24 గంటల నాణ్యమైన త్రీ-ఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని, లో- వోల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, విద్యుత్ కోతలపై సంబంధిత ఏఈ వెంటనే స్పందించి రైతులకు సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నిర్దిష్ట సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ హామీ ఇచ్చేంతవరకు ధర్నా విరమించబోమని అన్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. రైతులు రహదారిపై బైటాయించడంతో వాహనదారులు కాసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు ప్రజలలో భక్తి భావం పెరిగింది



వరంగల్, మన ప్రజాపక్షం:
ఎంతో నిష్టతో ఉండి భక్తిశ్రద్ధలతో గణపతి దేవుని పూజించడం వలన భక్తులకు స్వామివారి కృప కలిగి వారు కోరుకున్న కోరికలు నెరవేరుతున్నందున అనేక మంది భక్తులు వినాయక విగ్రహాలను నిలబెట్టి పంచ నవరాత్రుల ఉత్సవములు నిర్వహిస్తున్నారని 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శు క్రవారం రోజున నానమియా తోటలో సాయి గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రారంభించారు. నేడు ప్రజలలో భక్తి భావం పెరిగిందని నిర్వాహకులు అందరు గణేష్ నిమజ్జనం వరకు ఎంతో నిష్టతో ఉండాలని కోరారు.ఇట్టి అన్నదాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోరే రమేష్, కోరే శివకుమార్, ఏరోజు రాజు గౌడ, తిరుపతి, సాదుల రాజు, పెద్దూరి సతీష్, కోరే సదానందం, కోరే సుధాకర్, ఆకుతోట ఐలయ్య పాల్గొన్నారు.



అంగరంగ వైభవంగా కుంకుమ పూజ కార్యక్రమం

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ పట్టణంలోని పాతబీట్ బజార్లోని పబ్బా నాగేశ్వర్ రావు కాంప్లెక్స్ లో విగ్నేష్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వినాయక చతుర్థి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజ కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అయిత శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అయిత శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుండి ఇప్పుడు 8వ సంవత్సరంలో అడుగెడుతూ ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిత్య ఘనమైన పూజలు కుంకుమార్చనలు. హోమాలు. స్వామివారి కల్యాణం. వైభవంగా జరుపుకుంటున్నామనీ తెలిపారు. భక్తులందరికీ గణపతి స్వామి వారి ఆశీస్సులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని కోరుకుంటూ ఈ పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు ఆధ్యాత్మిక భావనతో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విగ్నేష్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు మరియు మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ శ్రీకాంత్

జనగామ, మన ప్రజాపక్షం:
బచ్చన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అంబేద్కర్ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట ఎస్సై శ్రీకాంత్ పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటంలో జరగకుండా నిమర్జన కార్యక్రమంలో తగు చర్యలు పాటించాలని మరియు డీజేలకు దూరంగా ఉండాలని యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు చెప్పిన విధంగా నడుచుకోవాలని, చదువుల్లో రాణించాలని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతురని తెలిసిన వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట సర్పంచ్ ఆల్వాల నర్సింగరావు, వార్డ్ మెంబర్ దేవరకొండ మల్లేష్ ,ఆల్వాల రాజేష్, అల్వాల శివయ్య, అల్వాల స్వామి, ఆల్వాల రాజు, దేవేందర్,ప్రశాంత్, రాగిశెట్టి కిషన్, అల్వాల బాలరాజ్ ఉదయ్, ప్రవీణ్,దినేష్, యశ్వంత్,మన్విత్, రాజేష్, విష్ణు, రాగిశెట్టి సందీప్, జయాల హర్షవర్ధన్,బిట్టు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం..

వినాయక చవితి వేళ విద్యార్థుల ప్రతిభతో మట్టి గణపతులు



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
వినాయక చవితి అంటే కొత్త విగ్రహం కొనుకొచ్చి పూజలు చేయడం మాత్రమే కాదు. మన చేతుల్లోనే పర్యావరణ రహిత గణపతిని తయారు చేసుకోవచ్చని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రెయిన్ బో ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు నిరూపించారు. వినాయక చవితి సందర్భంగా విద్యార్థులు స్వయంగా మట్టితో రకరకాల రూపంలో గణేశ విగ్రహాలను తయారుచేస్తూ తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోతాయని దీనివల్ల జలా వనరులకు జీవరాశులకు ఎలాంటి హానికరం జరగదని విద్యార్థులు తోటి వారికి ప్రజలకు అవగాహన కల్పించారు. విగ్రహాలు కొనుగోలు చేయకుండా తమ సృజనాత్మకతకు పదును పెట్టి స్వేచ్ఛమైన మట్టితో వినాయక విగ్రహాలను స్వయంగా తయారు చేసుకోని పర్యావరణాన్ని పరిరక్షించాలని విద్యార్థులు తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించాలని సందేశాన్ని విద్యార్థులు కళాత్మకంగా చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష, కరస్పాండెంట్ శ్రీరంగం సత్యనారాయణ చార్యులు,ఉపాధ్యాయులు కళ్యాణి, అర్చన, జయంతి, అనుష, సుజాత, శిరీష, నవిత, శివలీల, జబీనా, ప్రసన్న, మంజుల, పరుశురాం తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకల ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్ పరిశీలించారు.శ్రీపురం రోడ్డులోని నాగనూల్ చెరువు వద్ద నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువు వద్ద పారిశుధ్యం, లైటింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నిమజ్జన వేడుకలు విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



నాగర్ కర్నూల్ లో విషాదం - ఎంజెపి కాలేజీ విద్యార్థి మృతి

కలెక్టరేట్ కు విద్యార్థుల ర్యాలీ

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో విషాద ఘటన చోటుచేసుకుంది. ఎంజెపి బాయ్స్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భారత్ అనే విద్యార్థి స్వగ్రామంలో మృతి చెందాడు. విద్యార్థి మృతికి కాలేజీ సిబ్బందే కారణమంటూ వీఖ్రో బాయ్స్ కాలేజీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. భారత్ మృతికి నిరసనగా విద్యార్థులు కలెక్టరేట్ కు బయలుదేరారు. శ్రీపురం చౌరస్తాలో ధర్నాకు దిగి నిరసన వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులను నచ్చజెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రైవేట్ వాహనాల్లో ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. విద్యార్థి మృతికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

జిల్లా స్థాయి కిసాన్ మేళాకు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలి

నూతన వ్యవసాయ సాంకేతికత, ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందాలి
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం :వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పథకంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాస్థాయి కిసాన్ మేళాను శనివారం, సెప్టెంబర్ 19న పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కిసాన్ మేళాలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా స్టాల్స్‌లో నూతన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే సాగు విధానాలు, రైతులకు ఉపయోగకరమైన వ్యవసాయ సాంకేతికతలు, వివిధ ప్రభుత్వ పథకాలపై సమాచారాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు.అదేవిధంగా పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సాగు చేస్తున్న వివిధ పంటలను రైతులు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించనున్నట్లు,ఆయా పంటల సాగులో అవలంబిస్తున్న నూతన పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.కిసాన్ మేళాలో వివిధ వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని లాభసాటి వ్యవసాయం, పంటల సాగు విధానాలు, చీడపీడల నివారణ, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు, శాస్త్రవేత్తలు, రైతుల మధ్య ముఖాముఖి చర్చా కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను నేరుగా శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లి, వాటికి శాస్త్రీయ పరిష్కారాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.వివిధ శాఖల ఆధ్వర్యంలో రైతుల కోసం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, రైతు ప్రయోజన కార్యక్రమాలపై కూడా కిసాన్ మేళాలో సమగ్ర సమాచారాన్ని అందించనున్నట్లు, ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా పాల్గొననున్నట్లు కలెక్టర్ తెలిపారు.నాగర్‌కర్నూల్ జిల్లాలోని రైతులందరూ శనివారం ఉదయం 10:00 గంటల నుంచి పాలెం ఆర్ఆర్ఎస్ ఆడిటోరియంలో నిర్వహించే కిసాన్ మేళాకు అధిక సంఖ్యలో హాజరై, వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలపై అవగాహన పొందాలని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కిసాన్ మేళాను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పిలుపునిచ్చారు.



దోమల నివారణకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ పట్టణంలో దోమల నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ మరియు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.పట్టణంలోని ప్రతి వార్డులో ప్రతి వారం సాయంత్రం వేళ ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉదయం వేళల్లో మున్సిపల్ సిబ్బంది ద్వారా యాంటీ లార్వా అప్లికేషన్లు, లార్వైసైడ్ మందుల పిచికారీ చేపట్టి దోమల లార్వా అభివృద్ధిని అరికడుతున్నట్లు పేర్కొన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నివారించడం, పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం లక్ష్యంగా మున్సిపాలిటీ ప్రత్యేక శ్రద్ధతో నిరంతర పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతోందని కమిషనర్ తెలిపారు.పట్టణ ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల వృద్ధికి అనుకూలమైన ప్రదేశాలను గుర్తించినప్పుడు మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించాలని అధికారులు సూచించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోమల నివారణలో జనగామ మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని చైర్‌పర్సన్ మరియు కమిషనర్ తెలిపారు.

యూత్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు



జనగామ, మన ప్రజాపక్షం:
జనగామలోని కూరగాయల మార్కెట్ వీధిలో యూత్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతిష్టించిన ఐదు తలల పంచముఖ గణేశుడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు అత్యంత ఉత్సాహంగా ఉత్సవాలలో పాల్గొని రోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పూజా వేదిక ముందు భక్తులు సమర్పించిన బియ్యం మరియు ఇతర నైవేద్యాల సమర్పణ భక్తి భావాన్ని పెంచుతోంది. నవరాత్రుల పురస్కరించుకుని ప్రతిరోజూ పూజలతో పాటు సాయంత్రం వేళల్లో భక్తి సంగీత కచేరీలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి వివిధ పోటీలను కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కమిటీ సభ్యులు ఉత్సవాలు విజయవంతం చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నారు.





ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో చేతివాటం ప్రదర్శిస్తే క్రిమినల్ కేసులు

మీడియా కథనాలపై రాష్ట్ర విజిలెన్స్ అధికారుల విచారణ

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించి మీడియాలో ఇటీవల ప్రచురితమైన వివిధ వార్తా దిన పత్రికల కథనాలపై రాష్ట్ర విజిలెన్స్ అధికారి బాలరాం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో శుక్రవారం బిజినపల్లి మండలం, అచ్చంపేట పట్టణంలో పర్యటించి విచారణ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ అధికారులతో సమావేశమై, మీడియా కథనాల్లో ప్రస్తావించిన అంశాలపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంబంధించిన అంశాలపై అధికారుల నుంచి వివరణలు తీసుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర విజిలెన్స్ అధికారి బాలరాం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో అధికారులు లేదా ఇతర వ్యక్తులు ఎవరైనా చేతివాటం ప్రదర్శించినట్లు తేలితే ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం వారికి పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.బిజినపల్లి, అచ్చంపేట పట్టణాల్లో లబ్ధిదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం లేదా ఇతర అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే, బాధ్యులపై కేసులు నమోదు చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విచారణ సందర్భంగా సంబంధిత అధికారులు అవసరమైన వివరాలు, వివరణలను విజిలెన్స్ అధికారులకు అందించారు. మీడియా కథనాల్లో పేర్కొన్న అంశాలపై నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



తొలి డెంగ్యూ టీకా వచ్చేస్తోంది.. 2027లో క్యూడెంగ్యూ

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 18:
డెంగ్యూ నివారణకు తొలి టీకా 'క్యూడెంగ్యూ' వచ్చే ఏడాది తొలి అర్ధభాగంలో దేశీయంగా అందుబాటులోకి రాబోతున్నది. ఇందుకోసం జపాన్‌కు చెందిన టకెడా ఫార్మాస్యూటికల్ కంపెనీ... డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌తో శుక్రవారం ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా దేశంలోని ప్రైవేట్ మార్కెట్‌లో ఈ టీకాను డాక్టర్ రెడ్డీస్ దేశీయంగా పంపిణీ చేయనుంది. స్థానిక అధికారిక ప్రక్రియలు పూర్తైన తర్వాత 2027 ప్రథమార్ధంలో టీకా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. క్యూడెంగ్యూ టీకాకు కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ(సీడీఎస్‌సీఓ) ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా రెడ్డీస్ గ్లోబల్ జనరిక్ సీఈవో ఎంవీ రమణ మాట్లాడుతూ.. దేశంలో రెండో అతిపెద్ద వ్యాక్సిన్, తొలి ఆమోదిత డెంగ్యూ వ్యాక్సిన్‌ను ప్రవేశపెట్టడం దేశీయ ఆరోగ్య సంరక్షణ రంగానికి ఒక కీలక పరిణామమన్నారు. టకెడా ఫార్మాతో కుదుర్చుకున్న ఒప్పందంతో అర్హులైన వ్యక్తులకు క్యూడెంగ్యూను అందుబాటులోకి తీసుకురావడానికి, దేశంలో డెంగ్యూ భారాన్ని తగ్గించే ప్రయత్నాలకు తోడ్పాటునందించడానికి వీలు పడనున్నదన్నారు. టకెడా ఇంటర్నేషన్ బిజినెస్ హెడ్ మహేందర్ నాయక్ మాట్లాడుతూ..రెడ్డీతో కుదుర్చుకున్న ఒప్పందంతో భారత్‌లో తమ తొలి డెంగ్యూ వ్యాక్సిన్‌ను విడుదల చేయడానికి లైన్‌క్లియర్ అయిందని, ఇప్పటికే 43 దేశాల్లో 32 మిలియన్ల డోస్‌లను డిస్ట్రిబ్యూట్ చేసినట్టు చెప్పారు.ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో చిన్నారులు, పెద్దలకు టీకాను అందించేందుకు ఏర్పాట్ల చేస్తున్నారు. భారత్‌లో డెంగ్యూ కేసులు గత రెండు దశాబ్దాల్లో 11 రెట్లు పెరిగినట్లు సంస్థలు పేర్కొన్నాయి. గతంలో డెంగీ సోకినవారు, ముందస్తు పరీక్షలు అవసరం లేకుండానే ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవచ్చును. నాలుగు రకాల్లో డెండగీ వైరస్ వేరియంట్ల నుంచి రక్షణ కల్పించేలా రూపొందించిన క్యూడెంగా టీకా.. 4 నుంచి 40 ఏండ్ల వయసున్న వారు మూడు నెలల వ్యవధిలో 0.5 ఎంఎల్ చొప్పున రెండు మోతాదుల్లో ఈ టీకా వేసుకోవాల్సివుంటుంది.



ఎల్‌అండ్‌టీ-టాటా జట్టు..
దేశీయంగా చిప్‌ల తయారీకి వ్యూహాత్మక ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18:
స్వదేశీ చిప్ తయారీ కంపెనీలు టాటా ఎలక్ట్రానిక్స్, ఎల్‌అండ్‌టీ సెమీకండక్టర్ (ఎల్‌టీఎస్‌సీటీ) జట్టు కట్టాయి. ఇక ఇరు సంస్థల భాగస్వామ్యంతో భారత్‌లో చిప్‌లు తయారు కానున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో ఎంవోయూపై ఆయా సంస్థలు సంతకాలు చేసి మార్చుకున్నాయి. కాగా, టాటా ఎలక్ట్రానిక్స్ దొలేరాలో ఓ చిప్ తయారీ కేంద్రాన్ని రూ.91,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్నది. మరోవైపు ఎల్‌అండ్‌టీ సెమీకండక్టర్ చిప్ డిజైన్, దాని అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నది.'ఎల్‌టీఎస్‌సీటీతో మా భాగస్వామ్యం కీలక అడుగు. సెమీకండక్టర్ తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్‌లకు సంబంధించి మా సామర్థ్యాలతో ఎల్‌అండ్‌టీ సెమీకండక్టర్ డిజైనింగ్, ఇంజినీరింగ్ నైపుణ్యం తోడైతే పూర్తిస్థాయిలో సెమీకండక్టర్ ఉత్పాదక దేశంగా భారత్ పరుగులు పెట్టగలదు' అని టాటా ఎలక్ట్రానిక్స్ సీఈవో, ఎండీ రణ్‌ధీర్ ఠాకూర్ ఈ సందర్భంగా విశ్వాసాన్ని కనబర్చారు. అలాగే 'టాటా ఎలక్ట్రానిక్స్‌తో కలిసి దేశంలో తర్వాతి తరం సెమీకండక్టర్ ఉత్పత్తులను తయారుచేసే సామర్థ్యాలను నిర్మిస్తాం. గ్లోబల్ మార్కెట్లలోకి విస్తరిస్తాం' అని ఎల్‌టీఎస్‌సీటీ సీఈవో సందీప్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.



22-ఏ భూములపై వాస్తవాలు వెలుగులోకి తేవాలి

పదేళ్లలో వందల ఎకరాలు ఎలా?
భూముల లెక్క తేల్చాలి
ఫామ్‌హౌస్‌లు, ధరణి భూములపై లెక్క తేల్చాలి
ఉద్యమ సమయంలో సెంటు భూమి లేని వారికి పదేళ్లలో వందల ఎకరాలు ఎలా వచ్చాయి?
పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

జనగామ, మన ప్రజాపక్షం:
ఉద్యమ సమయంలో సెంటు భూమి కూడా లేని వారు పదేళ్ల కాలంలో వందల ఎకరాల భూములకు ఎలా అధిపతులయ్యారో ప్రజలకు సమాధానం చెప్పాలని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములు, ఫామ్‌హౌస్‌ల విస్తీర్ణం, భూముల కొనుగోళ్లు, బదలాయింపులు తదితర అంశాలపై ప్రజల్లో ఉన్న సందేహాలను అధికారిక రికార్డుల ఆధారంగా నివృత్తి చేయాలని కోరారు. ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించిన ఆస్తులు, అనంతరం జరిగిన ఆస్తుల మార్పుల వివరాలను ప్రజల ముందుంచాలని అన్నారు.

ధరణి, 22-ఏ భూములపై సమగ్ర విచారణ

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ అమలు, వీఆర్వో వ్యవస్థ రద్దు తదితర మార్పుల నేపథ్యంలో భూ రికార్డుల్లో జరిగిన మార్పులపై సమగ్ర పరిశీలన అవసరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములపై పాత రికార్డులు, ప్రస్తుత రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, రెవెన్యూ పత్రాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేట్ భూములకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై చట్టబద్ధమైన విచారణ జరపాలని కోరారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముత్తిరెడ్డి, ఎర్రబెల్లి ఆస్తుల లెక్కలు తేల్చాలి

వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్



మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రాజకీయాల్లోకి రాకముందు ఉన్న ఆస్తులు, అనంతరం ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తుల వివరాలను పోల్చి ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.ఎన్నికల అఫిడవిట్ ఆధారిత సమాచారం ప్రకారం ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి 2014లో సుమారు రూ.42.38 కోట్ల ఆస్తులు, 2018లో సుమారు రూ.41.83 కోట్ల ఆస్తులు ప్రకటించినట్లు తెలిపారు.అదేవిధంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు 2014 ఎన్నికల అఫిడవిట్‌లో సుమారు రూ.2.47 కోట్ల ఆస్తులు, 2018లో సుమారు రూ.8.12 కోట్లు, 2023లో సుమారు రూ.12.63 కోట్ల ఆస్తులు ప్రకటించినట్లు పేర్కొన్నారు.పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితర ప్రజాప్రతినిధుల ఆస్తుల వివరాలను కూడా అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించి, ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఆస్తుల పెరుగుదలకు సంబంధించిన ఆదాయ వనరులు, భూముల కొనుగోళ్లు, యాజమాన్య బదలాయింపులు తదితర అంశాలపై అధికారికంగా పరిశీలన జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.

నాలుగువేల ఎకరాల లెక్క చెప్పాలి

జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్స్‌పర్సన్ నూక కిరణ్ యాదవ్ మాట్లాడుతూ 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్నట్లు పేర్కొంటున్న భూముల ప్రస్తుత పరిస్థితిపై స్పష్టత అవసరమన్నారు. భూముల రికార్డుల్లో జరిగిన మార్పులు, రిజిస్ట్రేషన్లు, యాజమాన్య బదలాయింపులు, రెవెన్యూ రికార్డుల్లో మార్పులను అధికారికంగా పరిశీలించాలని కోరారు.కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లోని భూములపై వస్తున్న ఆరోపణలను కూడా రికార్డుల ఆధారంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు లేదా ఇతర నిషేధిత భూములకు సంబంధించి అక్రమాలు జరిగినట్లు విచారణలో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.

జనగామ భూములపై సమగ్ర సర్వే చేయాలి

జనగామ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేట్ భూములకు సంబంధించిన వివాదాలు, కబ్జా ఆరోపణలు, రికార్డుల మార్పులపై సమగ్ర సర్వే నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.ప్రతి ఎకరానికి సంబంధించిన పాత రికార్డు, ప్రస్తుత రికార్డు, యాజమాన్య మార్పులు, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి. భూములపై వచ్చిన ఆరోపణలకు రాజకీయ ఆరోపణలతో కాకుండా అధికారిక రికార్డులతో సమాధానం ఇవ్వాలని వారు పేర్కొన్నారు.భూముల విషయంలో ఎవరి పేరు ఉన్నా, ఎలాంటి రాజకీయ నేపథ్యం ఉన్నా నిష్పక్షపాతంగా రికార్డులను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.భూముల లెక్క తేల్చాలి.. ప్రతి ఎకరం భూమికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్పోక్స్‌పర్సన్ నూక కిరణ్ యాదవ్, వైటీడీఏ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జగదీష్ చంద్రారెడ్డి, కీసర దిలీప్ రెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, పట్టణ అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, ఆర్టీఏ సభ్యుడు అభిగౌడ్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లోకుంట్ల ప్రవీణ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మాజిద్ అప్సర్,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణ రెడ్డి, మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా చైర్మన్ సీసా ప్రదీప్ యాదవ్,వంగాల కళ్యాణి, డాక్టర్ రాజమౌళి,కౌన్సిలర్ మంత్రి సుమలత, సాధం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికార సమరభేరి సభను జయప్రదం చేయాలి

జనకళ్యాణ్ దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం :అక్టోబర్ 9న బడంగ్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) నాయకులు పిలుపునిచ్చారు.శుక్రవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో బిఎస్పీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, 4వ జోన్ ఇంచార్జ్ బీసమోళ్ల యోసేపు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిఎస్పీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరాం 20వ వర్ధంతి సందర్భంగా, బిఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో అక్టోబర్ 9న బడంగ్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా రాజారామ్ మాజీ ఎంపీ (రాజ్యసభ సభ్యులు) మరియు బిఎస్పీ 9 రాష్ట్రాల ఇంచార్జ్ హాజరవుతారని పేర్కొన్నారు.రానున్న 20 రోజుల పాటు బిఎస్పీ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామాన పర్యటించి ప్రజలను చైతన్యపరిచి, బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా జనవరి 15న బిఎస్పీ అధినేత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కుమారి మాయావతి జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని నాయకులు కోరారు. ప్రజల నుంచి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి పార్టీకి అందజేయాలనీ కోరారు.ఈ సందర్భంగా బిఎస్పీ పార్టీ ఎలక్టోరల్ బాండ్స్ సేకరించదని పేర్కొన్నారు. దేశంలో పేద ప్రజల దగ్గర విరాళాలు తీసుకుని, పేద ప్రజల కోసం మాత్రమే పనిచేసే పార్టీ బిఎస్పీ పార్టీయే అనీ స్పష్టం చేశారు.అనంతరం నాగర్ కర్నూల్ పట్టణానికి



చెందిన శ్రీ హర్ష ముదిరాజ్ ను బిఎస్పీ నాగర్ కర్నూల్ జిల్లా నూతన ఈసీ మెంబర్‌గా జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ నియమించారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఆంజనేయులు, అసెంబ్లీ అధ్యక్షులు పరుశరామ్, కల్వకుర్తి అసెంబ్లీ అధ్యక్షులు నీరటి రమేష్, కొల్లాపూర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాగర్ కర్నూల్ అసెంబ్లీ నాయకులు శంకర్, ఆంజనేయులు, బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, డివిజన్ అధ్యక్షులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఒక్కటే కాదు.. భవిష్యత్ పోటీని ఎదుర్కొనే నైపుణ్యాలు అవసరం

అకాడమిక్ తో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,
సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలి
విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పిలుపు

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
విద్యార్థులు కేవలం మౌలిక వసతులు, డిగ్రీ సాధించడంపైనే దృష్టి పెట్టకుండా భవిష్యత్‌లో ఎదురయ్యే పోటీని తట్టుకునేలా విద్యా ప్రమాణాలను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.అకాడమిక్ తో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,విస్తృత జ్ఞానం,సామాజిక బాధ్యతను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు.నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గత వారం రోజులుగా డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన తెలుగు భాషా-సంస్కృతి కార్యక్రమాల ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ ప్రసంగించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అకాడమిక్ పై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా వేలాది డిగ్రీ కళాశాలలు ఉన్నాయని, ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో కేవలం డిగ్రీ పట్టా చేతిలో ఉండటం ఉద్యోగ మార్కెట్‌లో పోటీని ఎదుర్కొనేందుకు సరిపోదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో పోటీ మరింత పెరుగుతోందన్నారు. విద్యార్థులు తమ డిగ్రీ విద్యతో





పాటు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒకే రకమైన ఉద్యోగానికి పరిమితం కాకుండా తమ ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా సంప్రదాయేతర రంగాల్లోని అవకాశాలను కూడా అన్వేషించాలని కలెక్టర్ సూచించారు. హాస్పిటాలిటీ వంటి రంగాలతో పాటు ప్రజా జీవితం,రాజకీయ రంగం తదితర విభిన్న రంగాల్లోనూ తమ ప్రతిభకు అనుగుణంగా అవకాశాలను పరిశీలించవచ్చన్నారు.కళాశాల విద్య పూర్తయ్యేలోపే తమ భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి ప్రారంభించాలని విద్యార్థులకు సూచించారు. లక్ష్యాన్ని నిర్ణయించుకున్న తర్వాత అవసరమైన విద్య, నైపుణ్యాలు, అనుభవాన్ని సమకూర్చుకునేందుకు నిరంతరం ప్రయత్నించాలని అన్నారు.డిగ్రీ పొందడం ద్వారా విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత కూడా ఏర్పడుతుందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ స్వగ్రామాలు, స్థానిక వార్డుల్లో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.విద్యార్థులు కేవలం తరగతి గదిలోని పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమనించాలని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర,జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సమకాలీన అంశాలపై విస్తృత జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు.వెనుకబడిన ప్రాంతంగా ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యతో పాటు నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన ఎంతో అవసరమన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, దానిని సమాజ ప్రయోజనానికి ఉపయోగించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.తెలంగాణ భాష,సంస్కృతి,సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆధునిక ప్రపంచానికి అవసరమైన సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను కూడా అలవరచుకోవాలని కలెక్టర్ సూచించారు. అకాడమిక్ కు మాత్రమే పరిమితం కాకుండా విస్తృత జ్ఞానాన్ని సంపాదించుకుని, తమ విద్యను వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు.అనంతరం వారం రోజులుగా నిర్వహించిన తెలుగు భాషా--సంస్కృతి కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, వారికి ప్రోత్సాహం అందించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిక శాఖ సలహా సభ్యులు, కవి, ముచ్చర్ల దినకర్ రావు, ప్రిన్సిపల్ డాక్టర్ కే.గీతాంజలి, కళాకారులు శంకర్, కళాశాల అధ్యాపకులు, తెలంగాణ భాషా-సాంస్కృతిక శాఖ ప్రతినిధులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సన్నగా ఉండే వారికే ప్రోటీన్ లోపం ఉంటుందా..

వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..?



అధిక బరువు లేదా ఊబకాయం ఉన్నవారు రోజూ ఎక్కువ ఆహారం, కేలరీలు తీసుకుంటున్నప్పటికీ వారి శరీరానికి అవసరమైనంత ప్రోటీన్ అందదు. సాధారణంగా ప్రోటీన్ లోపం అంటే సన్నగా ఉండేవారికే వస్తుందని భావిస్తారు. అయితే ఇది సరైన అవగాహన కాదు. కేలరీలు, ప్రోటీన్ రెండూ వేర్వేరు పోషకాలు. శుద్ధి చేసిన ధాన్యాలు, చక్కెర, వేయించిన పదార్థాలు, ఎక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని అధికంగా తీసుకుంటే బరువు పెరుగుతారు. అదే సమయంలో ప్రోటీన్ తీసుకోవడం మాత్రం తక్కువగా ఉంటుంది. అందువల్ల శరీర బరువును మాత్రమే చూసి పోషకాహార స్థితిని అంచనా వేయడం సరిపోదు.

నిండుగా భోజనం చేస్తే..

భారత్‌లో అనేక కుటుంబాల ఆహారంలో అన్నం, చపాతీలు, ఇతర ధాన్య పదార్థాలదే ప్రధాన భాగం. వీటితోపాటు పప్పులు, పెరుగు, పనీర్, గుడ్లు, చేపలు, చికెన్, సోయా, బీన్స్, శనగలు, గింజలు వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం అవసరం. అయితే వీటిని తీసుకునే పరిమాణం, తరచుదనం ఒక్కొక్కరి ఆహారపు అలవాట్లను బట్టి మారుతుంది. రోజుకు మూడు పూటలా భోజనం చేసి, మధ్యలో చిరుతిళ్లు తింటూ బరువు పెరుగుతున్న వ్యక్తి కూడా కండరాల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైనంత ప్రోటీన్ తీసుకోలేరు. కాబట్టి నిండుగా భోజనం చేస్తున్నామనే భావనతో శరీరానికి కావాల్సిన ప్రోటీన్ అందుతోందని అనుకోవద్దు.

ప్రోటీన్లతో ఉపయోగం ఏమిటి..

ప్రోటీన్ కండరాలను కాపాడడంతోపాటు శరీర కణజాలాల మరమ్మత్తు, ఎంజైములు, హార్మోన్ల తయారీ, రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు కీలకంగా ఉంటుంది. వయసు పెరిగే కొద్దీ కండరాల పరిమాణం, బలం సహజంగానే తగ్గుతాయి. శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక అనారోగ్యం లేదా సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి మరింత వేగంగా మారుతుంది. అధిక బరువు ఉన్న వృద్ధుల్లో శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉన్నప్పటికీ కండరాల బలం తగ్గే అవకాశం ఉంటుంది. తూకం యంత్రంపై బరువు స్థిరంగా ఉన్నా కండరాల బలం క్రమంగా తగ్గిపోతుంది. దీనివల్ల నడక, సమతుల్యత, రోజువారీ పనులు చేయడం, అనారోగ్యం లేదా గాయం నుంచి కోలుకోవడం కష్టమయ్యే అవకాశం ఉంటుంది.

కండరాలను కాపాడుకోవాలి..

బరువు తగ్గే ప్రయత్నాల్లో కేలరీలను తగ్గించడంపైనే కాకుండా కండరాలను కాపాడుకోవడంపైనా దృష్టి పెట్టాలి. ప్రోటీన్ సరిపడా తీసుకోవడంతోపాటు తగిన శారీరక శ్రమ కూడా అవసరం. ప్రోటీన్ అంటే కేవలం వ్యాయామం చేసే వారికి లేదా కండరాలు పెంచుకోవాలనుకునే వారికి మాత్రమే అవసరమైన పోషకం కాదు. పిల్లలకు ఎదుగుదలకు, పెద్దలకు శరీర కణజాలాల నిర్వహణకు, వృద్ధులకు కండరాల బలం, శారీరక సామర్థ్యాన్ని కాపాడుకోవడానికి ఇది అవసరం. వయసు, శరీర పరిమాణం, శారీరక శ్రమ, ఆరోగ్య పరిస్థితులను బట్టి అవసరమైన ప్రోటీన్ పరిమాణం మారుతుంది. అందువల్ల ప్రతి ప్రధాన భోజనంలో ప్రోటీన్ ఉండేలా చూసుకోవడం మంచిది. గుడ్లు, పెరుగు, పప్పులు, పనీర్, సోయా, బీన్స్, శనగలు, చేపలు, మాంసం, గింజలు వంటి ఆహారాలను ఆహారపు అలవాట్లకు అనుగుణంగా చేర్చుకోవచ్చు. ప్రోటీన్ లోపం శరీర ఆకారంతో సంబంధం లేకుండా ఎవరికైనా వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.



సాధారణ తెల్ల ఉప్పుకు బదులుగా సైంధవ లవణాన్ని వాడవచ్చా.. రెండింటికీ తేడాలేమిటి..?

ఇటీవల ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో చాలామంది సాధారణ తెల్ల ఉప్పుకు బదులుగా సైంధవ లవణం (సెందా నమక్) వాడుతున్నారు. ఇది గుండె ఆరోగ్యానికి, రక్తపోటుకు, విశ్రాంతి సమయంలో గుండె కొట్టుకునే వేగానికి మంచిదనే భావన చాలామందిలో ఉంది. అయితే తెల్ల ఉప్పు స్థానంలో సైంధవ లవణాన్ని ఉపయోగించడం వల్ల గుండె వేగం తప్పనిసరిగా తగ్గుతుందా అనే విషయంలో నిపుణులు కీలక విషయాలను చెబుతున్నారు. రెండు రకాల ఉప్పుల్లో ప్రధానంగా ఉండేది సోడియం క్లోరైడే. సాధారణ తెల్ల ఉప్పులో దాదాపు 97 నుంచి 99 శాతం సోడియం క్లోరైడ్ ఉంటుంది. దీనికి అయోడిన్‌ను కలపడం ద్వారా థైరాయిడ్ సమస్యలు, అయోడిన్ లోపాన్ని నివారించేందుకు ఉపయోగపడుతుంది.

ఖనిజాలు అధికం..

సైంధవ లవణం మాత్రం సహజసిద్ధమైన రూపంలో లభిస్తుంది. ఇందులో పొటాషియం, మెగ్నిషియం, కాల్షియం, ఇనుము వంటి ఖనిజాలు స్వల్పంగా ఉంటాయి. అయితే ఈ ఖనిజాల పరిమాణం చాలా తక్కువగా ఉండడంతో వాటిని చికిత్సా ప్రయోజనాలకు సరిపడే స్థాయిలో ఉన్నాయని చెప్పలేం. ఉప్పు ఏ రకమైనదైనా శరీరం దానిలోని సోడియంనే ప్రధానంగా పరిగణిస్తుంది. సోడియం అధికంగా తీసుకున్నప్పుడు శరీరంలో అదనపు నీరు నిల్వ అవుతుంది. దీంతో రక్త పరిమాణం పెరిగి రక్తనాళాలపై ఒత్తిడి అధికమవుతుంది. దీర్ఘకాలంలో ఇది అధిక రక్తపోటుకు, గుండెపై అదనపు భారానికి కారణమవుతుంది. కొంతమందిలో విశ్రాంతి సమయంలో గుండె కొట్టుకునే వేగం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

సైంధవ లవణానికి మారితే..

అందువల్ల తెల్ల ఉప్పు నుంచి సైంధవ లవణానికి మారినంత మాత్రాన గుండె వేగం తగ్గదు. రోజువారీగా తీసుకునే మొత్తం సోడియం పరిమాణం తగ్గితేనే ప్రయోజనం ఉంటుంది. సైంధవ లవణం ఆరోగ్యకరమైనదనే నమ్మకంతో ఎక్కువగా ఉపయోగిస్తే, మొత్తం సోడియం తీసుకోవడం మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. ఇది రక్తపోటుతో పాటు మూత్రపిండాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. మరో ముఖ్యమైన విషయం అయోడిన్. సాధారణ అయోడైజ్డ్ ఉప్పులో ఉండే అయోడిన్ సైంధవ లవణంలో సాధారణంగా ఉండదు. అయోడిన్ థైరాయిడ్ హార్మోన్ల తయారీకి అవసరం. అయోడిన్ లోపం వల్ల థైరాయిడ్ పనితీరులో మార్పులు వచ్చి గుండె వేగంలో కూడా అసాధారణ మార్పులు వస్తాయి. అందువల్ల సాధారణ వంటల్లో అయోడైజ్డ్ ఉప్పును పూర్తిగా మానేయడం కంటే, అవసరాన్ని బట్టి సైంధవ లవణాన్ని పరిమితంగా ఉపయోగించడం మంచిది.

ఉప్పు వినియోగాన్ని తగ్గించాలి..

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉప్పు రకం మార్చడం కంటే రోజువారీ మొత్తం ఉప్పు వినియోగాన్ని తగ్గించడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం రోజుకు మొత్తం ఉప్పు వినియోగం 5 గ్రాములకు మించకపోవడం మంచిది. ప్యాకేజ్డ్ చిరుతిళ్లు, ప్రాసెస్ చేసిన మాంసాహారం, తక్షణం తయారయ్యే నూడుల్స్, సాస్‌లు, బేకరీ పదార్థాల్లో దాగి ఉన్న సోడియాన్ని కూడా తగ్గించాలి. అరటిపండ్లు, కొబ్బరి నీరు, పాలకూర, పప్పులు, చిలగడదుంప వంటి ఆహారాల ద్వారా పొటాషియం పొందడం ఉపయోగకరం. రోజూ నడక, ఈత లేదా సైక్లింగ్ వంటి తేలికపాటి వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, 7-8 గంటల నిద్ర కూడా విశ్రాంతి సమయంలో గుండె వేగాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి. విశ్రాంతి సమయంలో గుండె వేగం నిరంతరం నిమిషానికి 100 కంటే ఎక్కువగా ఉండడం, గుండె దడ, తల తిరగడం, ఛాతీలో అసౌకర్యం లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. దేశంలో అధికంగా పెరుగుతున్న డెంగ్యూ, విషీ జ్వరాల కేసులు..



వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న అనూహ్య మార్పులు భారత్‌లో డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులతోపాటు వేడి సంబంధిత అనారోగ్యాల ముప్పును కూడా పెంచుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. ఎల్ నినో ప్రభావంతో సాధారణానికి భిన్నమైన ఉష్ణోగ్రతలు, ఎక్కువ కాలం కొనసాగే పొడి వాతావరణం, అకస్మాత్తుగా కురిసే భారీ వర్షాలు నమోదవుతున్నాయి. దీంతో వర్షాకాల వ్యాధులు, తీవ్రమైన వేడి కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలు ఒకేసారి పెరిగే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే ఢిల్లీలో ఆగస్టు నెలలో 90 కొత్త డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. దీంతో ఆ సీజన్‌లో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 311కి చేరింది. అదే సమయంలో మలేరియా కేసులు జూలైలో 17 నుంచి ఆగస్టులో 53కి పెరిగాయి.

వాతావరణ మార్పులే కారణం..

ఎల్ నినో కారణంగా ఏర్పడే వాతావరణ మార్పులు దోమల వృద్ధి, వ్యాధుల వ్యాప్తిపై ప్రభావం చూపుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏడిస్ ఈజిప్టి దోమలో డెంగ్యూ వైరస్ అభివృద్ధి చెందే వేగం పెరుగుతుంది. మరోవైపు అసమాన వర్షపాతం కారణంగా ఇళ్లలోని నీటి నిల్వలు, కూలర్ల ట్రేలు, పూల కుండీల కింద ఉండే పాత్రలు, నిర్మాణ ప్రాంతాలు, కాలువల్లో నీరు నిలిచిపోతుంది. ఇవి దోమల పెరుగుదలకు అనుకూల ప్రాంతాలుగా మారుతాయి. అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం కలిసినప్పుడు వడదెబ్బ, శరీరంలో నీరు తగ్గిపోవడం, తీవ్రమైన వేడి కారణంగా ఇతర ఆరోగ్య సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

ఈ లక్షణాలు కనిపిస్తే..

వేడి కారణంగా వచ్చే అనారోగ్యాలు, డెంగ్యూ లక్షణాలు కొన్ని సందర్భాల్లో ఒకేలా కనిపిస్తాయి. తీవ్రమైన వేడి వల్ల అలసట, తల తిరగడం, వేగంగా గుండె కొట్టుకోవడం, కండరాల్లో తీవ్రమైన నొప్పులు, గందరగోళం, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డెంగ్యూ విషయంలో అధిక జ్వరం, కళ్ల వెనుక తీవ్రమైన నొప్పి, కీళ్లు, కండరాల్లో నొప్పులు, చర్మంపై దద్దుర్లు, వాంతులు లేదా వికారం, రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలు కనిపించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.

జాగ్రత్తలు తప్పనిసరి..

డెంగ్యూ, వేడి సంబంధిత అనారోగ్యాల నుంచి రక్షణ పొందేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వారానికి కనీసం ఒకసారి నీటి నిల్వ పాత్రలు, కూలర్ల ట్రేలు, పూల కుండీల కింద ఉండే పాత్రలను ఖాళీ చేసి శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. దోమల నివారణకు తగిన దోమల వికర్షకాలను ఉపయోగించడం, కిటికీలు, తలుపులకు మెష్ ఏర్పాటు చేసుకోవడం, పూర్తిగా శరీరాన్ని కప్పే పలుచని దుస్తులు ధరించడం ఉపయోగకరంగా ఉంటుంది. వేడి ఎక్కువగా ఉండే మధ్యాహ్న సమయంలో బయట శారీరక శ్రమను తగ్గించి, తగినంత నీరు, ఓఆర్ఎస్, కొబ్బరి నీరు లేదా ఎలక్ట్రోలైట్ ద్రవాలు తీసుకోవాలి. అలాగే బహిరంగ కాలువలు, నీరు పొంగిపొర్లే ట్యాంకులు, పేరుకుపోయిన చెత్త వంటి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చు.

సెప్సిస్ అంటే ఏమిటి.. మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ ఉంటే సెప్సిస్ వస్తుందా..

మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ (యూటీఐ) సాధారణంగా చికిత్సతో తగ్గిపోయే సమస్యే. మూత్రం పోసేటప్పుడు మంట, తరచూ మూత్ర విసర్జన, కింది పొత్తికడుపులో అసౌకర్యం, మూత్రం మసకగా లేదా దుర్వాసనతో ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా సందర్భాల్లో ఇన్ఫెక్షన్ మూత్రాశయానికే పరిమితమవుతుంది. అయితే ఇన్ఫెక్షన్‌ను నిర్లక్ష్యం చేయడం లేదా తీవ్రమైన లక్షణాలు కనిపించినా చికిత్స ఆలస్యం చేయడం వల్ల కొన్ని సందర్భాల్లో పరిస్థితి తీవ్రమవుతుంది. ఇన్ఫెక్షన్ మూత్రాశయం నుంచి మూత్రపిండాలకు చేరి, అక్కడి నుంచి రక్తంలోకి బ్యాక్టీరియా ప్రవేశిస్తే సెప్సిస్‌కు దారితీసే అవకాశం ఉంటుంది. ఇది శరీరంలోని ముఖ్యమైన అవయవాల పనితీరును దెబ్బతీసే తీవ్రమైన పరిస్థితి. అయితే ప్రతి యూటీఐ సెప్సిస్‌గా మారుతుందని కాదు.

ఎలాంటి లక్షణాలు ఉంటాయి..

ఇన్ఫెక్షన్ మూత్రపిండాలకు చేరినప్పుడు లక్షణాల్లో మార్పు కనిపిస్తుంది. జ్వరం, చలి, వెన్ను లేదా పక్కటెముకల కింద నొప్పి, వికారం, వాంతులు, తీవ్రమైన నీరసం వంటి లక్షణాలు వస్తాయి. కొందరిలో మూత్రం పోసేటప్పుడు మంట, తరచూ మూత్రం రావడం కొనసాగుతుండగా, మరికొందరిలో ప్రధానంగా జ్వరం, బలహీనత మాత్రమే కనిపిస్తాయి. బ్యాక్టీరియా రక్తంలోకి చేరినప్పుడు శరీరమంతా ప్రభావితమయ్యే ప్రతిచర్య మొదలవుతుంది. రక్తపోటు పడిపోవడం, గుండె వేగం పెరగడం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు లేదా మెదడు వంటి అవయవాల పనితీరు దెబ్బతినడం వంటి పరిస్థితులు ఏర్పడతాయి. వృద్ధులు, మధుమేహం ఉన్నవారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

ఎప్పుడు తీవ్రమవుతుంది..

మూత్ర నాళాల్లో అడ్డంకులు ఉన్నవారిలో కూడా ఇన్ఫెక్షన్ నియంత్రించడం కష్టమవుతుంది. మూత్రపిండాల్లో రాళ్లు, పురుషుల్లో ప్రోస్టేట్ పరిమాణం పెరగడం, మూత్ర వ్యవస్థలో నిర్మాణపరమైన సమస్యలు, మూత్ర కాథెటర్ ఉపయోగించడం వంటి పరిస్థితులు ప్రమాదాన్ని పెంచుతాయి. గర్భిణీల్లో కూడా యూటీఐ మూత్రపిండాల ఇన్ఫెక్షన్‌గా మారే అవకాశం ఎక్కువగా ఉండడంతో ప్రత్యేక శ్రద్ధ అవసరం. మూత్ర సంబంధిత లక్షణాలతో పాటు జ్వరం లేదా చలి, వెన్ను లేదా పక్క భాగంలో నొప్పి, పదేపదే వాంతులు, తీవ్రమైన బలహీనత, తల తిరగడం, గందరగోళం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. మూత్రం చాలా తక్కువగా రావడం, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా పరిస్థితి వేగంగా దిగజారుతున్నట్లు అనిపించడం అత్యవసర వైద్య సహాయం అవసరమయ్యే సంకేతాలు.

ఎలా పరీక్షిస్తారు..

సెప్సిస్ అనుమానం ఉంటే వైద్యులు రక్తపోటు, గుండె వేగం, శ్వాస వేగం, శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయిలను పరిశీలిస్తారు. రక్తం, మూత్ర పరీక్షలతో ఇన్ఫెక్షన్ తీవ్రతను అంచనా వేస్తారు.

మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్ర ప్రవాహానికి అడ్డంకి ఉందని అనుమానం ఉంటే అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ వంటి పరీక్షలు చేస్తారు. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు వైద్యుల సూచన మేరకు యాంటీబయాటిక్స్ ఇస్తారు. తీవ్రమైన పరిస్థితుల్లో ఆసుపత్రిలో సిర ద్వారా మందులు, ద్రవాలు ఇవ్వాల్సి వస్తుంది. పాత అనారోగ్యానికి మిగిలిన యాంటీబయాటిక్స్‌ను స్వయంగా వాడకూడదు. సరైన మందు, మోతాదు, వ్యవధి కోసం అవసరమైతే మూత్ర పరీక్ష, మూత్ర కల్చర్ పరీక్షలు చేస్తారు.



సాధారణ యూటీఐ సాధారణంగా సెప్సిస్‌గా మారదు. అయితే లక్షణాలు తీవ్రమవుతున్నప్పుడు చికిత్స ఆలస్యం చేయకుండా ముందుగానే వైద్య సహాయం పొందడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.

"మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండు"..

శ్రుతి హాసన్ ఇలా అనేసిందేంటి?

"మగవాళ్లకు కూడా నెలసరి (పీరియడ్స్) వస్తే ఎంత బాగుండు! కనీసం అప్పుడైనా మా కాంట్రాక్టులలో అధికారికంగా 'పీరియడ్స్ సెలవులు' అని రాసేవారేమో" అంటూ ప్రముఖ నటి శ్రుతి హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. మహిళలు ముఖ్యంగా సినీ రంగంలో పనిచేసే వారు పీరియడ్స్ సమయంలో ఎదుర్కొనే శారీరక, మానసిక ఇబ్బందుల గురించి ఆమె బహిరంగంగా మాట్లాడారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న ఓ పాడ్‌కాస్ట్‌లో శ్రుతి ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.తాను పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) అనే ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నానని, దీనివల్ల పీరియడ్స్ సమయంలో తీవ్రమైన నొప్పిని ఎదుర్కొంటానని ఆమె వెల్లడించారు. కెరీర్ తొలినాళ్లలో షూటింగ్ సెట్‌లో ఈ నొప్పి గురించి ఎవరితోనూ చెప్పుకోలేకపోయానని గుర్తుచేసుకున్నారు. ఒకవైపు ఈ అంశంపై మాట్లాడటం నిషిద్ధం అని భావించడం, మరోవైపు ఇబ్బందిగా ఉండటంతో మౌనంగా భరించేదాన్నని తెలిపారు. "కొన్ని రోజులు నేను చాలా నీరసంగా కనిపించేదాన్ని. నా ఎనర్జీ లెవెల్స్ పడిపోయేవి. కానీ, దర్శకులు గానీ, ఇతరులు గానీ నాలో ఆ మార్పును గమనించినా అసలు కారణం వారికి తెలిసేది కాదు" అని శ్రుతి వివరించారు.అయితే, ఓ సంఘటన తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని శ్రుతి తెలిపారు. తన సహనటుడికి మోకాలికి సర్జరీ అయినప్పుడు, షూటింగ్ సిబ్బంది మొత్తం అతనికి అనుకూలంగా ఏర్పాట్లు చేసి, చాలా జాగ్రత్తగా చూసుకున్నారని చెప్పారు. అది చూశాక, తన ఆరోగ్య సమస్య గురించి కూడా ధైర్యంగా మాట్లాడాలని నిర్ణయించుకున్నానని అన్నారు.ఆ తర్వాత మొదటిసారి ఓ దర్శకుడికి తన ఆరోగ్య పరిస్థితిని వివరించానని, ఆయనకు కూడా కూతురు ఉండటంతో తన బాధను వెంటనే అర్థం చేసుకున్నారని శ్రుతి గుర్తుచేసుకున్నారు. "ఆయన సానుకూల స్పందనతో మా మధ్య సంభాషణ తీరే మారిపోయింది. సెట్‌లో వాతావరణం మరింత స్నేహపూర్వకంగా మారింది. ఆ తర్వాత నుంచి నా ఇబ్బందిని ధైర్యంగా చెప్పగలుగుతున్నాను" అని ఆమె పేర్కొన్నారు.శ్రుతి వ్యాఖ్యలకు సోహా అలీ ఖాన్ కూడా మద్దతు తెలిపారు. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే, ఎవరు ఎక్కువ బ్లీడ్ అయ్యారు, ఎవరి ట్యాంపూన్ సైజు పెద్దది అనే విషయాల్లో వారు పోటీ పడేవారేమోనని సరదాగా వ్యాఖ్యానించారు.ఇక శ్రుతి సినిమాల విషయానికొస్తే, గతేడాది రజినీకాంత్‌తో కలిసి నటించిన 'కూలీ' చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.518 కోట్లు వసూలు చేసినా మిశ్రమ స్పందనలు అందుకుంది. ఇటీవల 'పెద్ది' చిత్రంలో ఓ పాటలో ఆమె కనిపించారు. ప్రస్తుతం ఆమె విజయ్ సేతుపతితో కలిసి తమిళంలో 'ట్రైన్', దుల్కర్ సల్మాన్‌తో తెలుగులో 'ఆకాశంలో ఒక తార' చిత్రాల్లో నటిస్తున్నారు.




అఫ్గానిస్థాన్‌పై ఎలాంటి వివక్ష చూపించలేదు: ఢిల్లీ క్రికెట్ బోర్డు

ఇంటర్నెట్ డెస్క్: భారత్-అఫ్గానిస్థాన్ టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వడం గొప్ప అనుభవమని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (ణణజూ) డైరెక్టర్ శ్యామ్ సుందర్ అన్నారు. స్టేడియంలోని సౌకర్యాలు, పిచ్‌పై అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, ఆ జట్టు సభ్యులు ప్రశంసలు కురిపించారని తెలిపారు. అఫ్గాన్ జట్టు అయినా.. ఢిల్లీ ప్రేక్షకులు ఎలాంటి వివక్ష చూపకుండా ఇరు జట్ల ఆటగాళ్లను సమానంగా ప్రోత్సహించారని పేర్కొన్నారు.'మొదటిసారి మా సొంత స్టేడియంలో సిరీస్‌కు ఆతిథ్యం ఇచ్చాం. ఇది మాకు ఎంతో గొప్ప అనుభవం. అద్భుతమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నించాం. అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, ఆ జట్టు సభ్యులు మా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పిచ్‌ను వారు ప్రశంసించడం ఎంతో ఆనందంగా అనిపించింది. అఫ్గాన్ అభిమానులే కాదు.. ఢిల్లీ ప్రేక్షకులు కూడా ఆటను ఆస్వాదించారు. విదేశీ జట్టు విషయంలో ఎలాంటి వివక్ష కనిపించలేదు. స్టేడియంలో అద్భుతమైన వాతావరణం నెలకొంది. అఫ్గానిస్థాన్ చాలా మంచి జట్టు. అఫ్గానిస్థాన్ క్రికెట్‌ను ప్రోత్సహించాలన్నది ఐసీసీ ఛైర్మన్ జై షా విజన్. అసోసియేట్ దేశాల్లో క్రికెట్ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. ఆ ప్రయత్నాల ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి' అని శ్యామ్ సుందర్ తెలిపారు.

దేశానికి గర్వకారణం..

భారత్ 3-0తో సిరీస్‌ను గెలవడంపై ణణజూ కార్యదర్శి అశోక్ శర్మ సంతోషం వ్యక్తం చేశారు.



గతంలో వరుసగా రెండు సిరీస్‌లలో ఓటములు ఎదురైన నేపథ్యంలో ఈ విజయం దేశవ్యాప్తంగా ఆనందాన్ని తీసుకొచ్చిందని అన్నారు. 'భారత్ సిరీస్ గెలవడం ఎంతో ఆనందంగా ఉంది. గత రెండు సిరీస్‌ల్లో ఓడిపోయిన తర్వాత ఈ విజయం దేశ ప్రజలకు సంతోషాన్ని ఇచ్చింది. ణణజూ ఆతిథ్యంలో సిరీస్ విజయవంతంగా జరిగింది. అఫ్గానిస్థాన్ మేనేజ్‌మెంట్ భారత్‌లోని 'అతిథి దేవో భవ' స్ఫూర్తిని తమ దేశానికి తీసుకెళ్లి అక్కడి వారికి చెబుతుందని ఆశిస్తున్నాం. అఫ్గాన్ జట్టు మళ్లీ ఢిల్లీకి రావాలని కోరుకుంటున్నాం. వారికి బీసీసీఐ ద్వారా డీడీసీఏ ఎప్పుడూ అండగా ఉంటుంది' అని అశోక్ శర్మ అన్నారు.

SPORTS



ఆసియా క్రీడల్లో భారత పతాకధారులుగా మనూ భాకర్, తజీందర్‌పాల్ సింగ్

ఇంటర్నెట్ డెస్క్: జపాన్‌లోని ఐచీ నగోయాలో రేపటి నుంచి 19న ప్రారంభం కానున్న 2026 ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత పతాకధారులుగా రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మనూ భాకర్, ఆసియా క్రీడల ప్రస్తుత చాంపియన్ తజీందర్‌పాల్ సింగ్ తూర్ ఎంపికయ్యారు. వీరిద్దరి ఎంపికను శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. భారత బృందం చీఫ్ డి మిషన్ సహదేవ్ యాదవ్ మనూ భాకర్ పేరును ప్రకటించగా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తజీందర్‌పాల్ సింగ్ తూర్‌ను రెండో పతాకధారిగా ఖరారు చేసింది. కాగా.. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మనూ భాకర్ అద్భుత ప్రదర్శన చేసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించిన ఆమె.. సరబ్జోత్ సింగ్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో మరో కాంస్యాన్ని సాధించింది. దీంతో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా ఆమె చరిత్ర సృష్టించింది.

హర్మన్‌ను తప్పించి స్మృతికి కెప్టెన్సీ ఇవ్వాలి: మాజీ స్టార్ క్రికెటర్

ఇంటర్నెట్ డెస్క్: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీ మార్పుపై మాజీ క్రికెటర్ డయానా ఎడుల్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తప్పించి.. స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని ఆమె అభిప్రాయపడ్డారు. భవిష్యత్ ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నాయకత్వ మార్పు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు.'మనం స్మృతి మంధానను చాలా కాలంగా ఆపుతున్నాం. ఇప్పుడు హర్మన్ ప్రీత్ కౌర్ వయసు 37 ఏళ్లు. తదుపరి వన్డే ప్రపంచకప్ వచ్చే సమయానికి హర్మన్ దాదాపు 40 ఏళ్లకు చేరుకుంటుంది. కాబట్టి స్వయంగా హర్మన్ ఆ బాధ్యతల నుంచి తప్పుకోవాలి. స్మృతికి కెప్టెన్సీని అప్పగించాలి. ఇద్దరు యువ క్రికెటర్లను వైస్ కెప్టెన్లుగా పరిశీలించాలి. హర్మన్‌కు నా వినమ్ర విజ్ఞప్తి ఒక్కటే.. ఇంకా ఎందుకు కెప్టెన్‌గా ఉన్నావనే ప్రశ్న మాత్రం ఎదుర్కొనే పరిస్థితి తెచ్చుకోవద్దు?' అని డయానా ఎడుల్జీ వెల్లడించారు.

పవర్ గేమ్‌లో స్మృతి దూకుడు

మరోవైపు మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా కూడా స్మృతి మంధాన బ్యాటింగ్‌లో వచ్చిన మార్పులపై ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా పవర్ గేమ్‌ను స్మృతి గణనీయంగా మెరుగుపర్చుకుందని తెలిపారు. 'రెండేళ్లుగా స్మృతి తన పవర్ గేమ్‌పై ఎంతగా పని చేసిందో చూడటం చాలా ఆనందంగా ఉంది. ఇప్పుడు ఆమె ఎంతో సులభంగా బంతిని బౌండరీ దాటిస్తోంది. ఇది నిజంగా సంతోషించాల్సిన విషయం. ప్లేయర్లు తమను తాము మెరుగుపర్చుకోవాల్సిన అవసరం గురించి గతంలో చాలా మాట్లాడుకున్నాం. ముఖ్యంగా మిడిలార్డర్‌లో ఆడే ఆటగాళ్లు లేదా జట్టులోకి కొత్తగా వస్తున్న యువ క్రికెటర్లు స్మృతిని ఉదాహరణగా తీసుకోవచ్చు. రెండేళ్ల క్రితం స్మృతి టీ20, వన్డే క్రికెట్ ఎలా ఆడింది? ఇప్పుడు టీ20ల్లో ఎలా ఆడుతోంది? ముఖ్యంగా స్పిన్నర్లపై ఆమె చూపిస్తున్న ఆధిపత్యం అద్భుతం' అని అంజుమ్ చోప్రా వివరించారు.

